క్లుప్తంగా

ప్రజాస్వామ్యం అపహాస్యం



నయింనగర్: బీజేపీ తన హిందూత్వ ఏజెండాను అమలు చేసేందుకు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తోందని నవ జన శక్తి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మనోజ్ శంకర్ నెల్లూరు ఆరోపించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ తెలంగాణలో 40 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తోందని, అందులో పరకాల నుంచి జన్ను ప్రమీల, వర్ధన్నపేటలో ఈసంపల్లి వేణు, స్టేషన్ ఘన్‌పూర్‌లో ఈ.శ్రీనివాస్, వరంగల్‌లో కే.సురేష్, బెల్లంపల్లి నుంచి డీ.చేతన్‌కుమార్ పోటీ చేస్తారని వివరించారు. ఇండియా పేరు మార్పు వెనుక సంఘ్ పరివార్ రాచరిక భావజాలం దాగి ఉందని విమర్శించారు. తెలంగాణ సీఎం కేసీఆర్.. రూ.లక్షల కోట్ల అవినీతి చేశారని అన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



న్యూశాయంపేట: కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని జమాతే ఇస్లామీ హింద్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ మిర్జా హుస్సేనీ బేగ్ సూచించారు. నగరంలోని ఉర్సులో హుమెన్ వెల్ఫేర్ సెంటర్‌లో 8వ బ్యాచ్ కుట్టు శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలకు కుట్టుమిషన్లు, సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. జేఐహెచ్ ఖిలా వరంగల్ మండల అధ్యక్షుడు అబ్దుల్ అలీం, మహ్మద్ ఉమర్, అబ్దుల్ జబ్బార్, సయ్యద్ అజరుద్దీన్ పాల్గొన్నారు.

కమీషన్ వ్యాపారులపై చర్య తీసుకోవాలి



వరంగల్: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో కొందరు కమీషన్ వ్యాపారులు వర్తక సంఘం పేరుతో నిబంధనలకు విరుద్ధంగా మార్కెట్ అధికారులతో కుమ్మక్కై టెండర్ల పేరుతో అక్రమ దందాకు పాల్పడుతున్నారని, వారిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు కోరారు. ఈమేరకు వరంగల్ జేడీఎం, ప్రస్తుత మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జ్ మల్లేషం, డీడీఎం అజ్మీరా రాజునాయక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు బాపిపాక రమేష్, కుమారస్వామి, సంపత్ కుమార్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు అన్ని వర్గాల మద్దతు

హన్మకొండ: ఎస్సీ వర్గీకరణకు అన్ని వర్గాలు మద్దతు ఇస్తున్నా కేంద్రం మాత్రం జాప్యం చేయడం అన్యాయమని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్ సింగ్ నాయక్, సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సాంబయ్య యాదవ్ అన్నారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడవ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ చంద్రమౌళి మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, గంగారపు శ్రీనివాస్ మాదిగ, అంకిల్ల రాజు, బొడ్డు శాంతి సాగర్, శివ, చిలుక రాజు, సోంపెల్లి అన్వేష్, మాచర్ల బాబు, పాడిశెట్టి ప్రతాప్, సురేందర్, చింతల జయరాజు, శంకర్, బాలస్వామి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ గొప్ప వరం

రామన్నపేట: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చికిత్స పొందేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) గొప్ప వరంలాంటిదని ప్రభుత్వ చీఫ్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కల్పలత సూపర్‌బజార్‌లో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఈ సందర్భంగా 14మందికి రూ.16 లక్షల విలువ గల చెక్కులను అందజేశారు. పలు డివిజన్ల కార్పొరేటర్లు, అధ్యక్షులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి

హసన్‌పర్తి: పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆదేశించారు. 56వ డివిజన్ సుభాష్‌నగర్‌కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే సోమవారం పరిశీలించి మాట్లాడారు. నాణ్యతా ప్రమాణాల్లో రాజీ లేకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు.

జనం బారులు.. దరఖాస్తుల కుప్పలు

- హనుమకొండ ప్రజావాణికి 187 వినతులు
- దళితబంధు, డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసమే అధికం
- వినతులు స్వీకరించిన కలెక్టర్, అదనపు కలెక్టర్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఏసీ మహేందర్‌జీ, తదితరులు

హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి(గ్రీవెన్స్)కి వినతులు వెల్లువెత్తాయి. మొత్తం 187 వినతులు అందగా, వాటిలో ఎక్కువగా దళితబంధు పథకం కోసం ఎస్సీ కార్పొరేషన్‌కు, గృహలక్ష్మి పథకం ఇవ్వాలని డబుల్ బెడ్‌రూం నోడల్ అధికారికి అందాయి. తరువాతి స్థాయిలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు వచ్చాయి.

11.40 గంటలకు కలెక్టర్

ఉదయం నుంచి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న కలెక్టర్ సిక్తాపట్నాయక్ ప్రజావాణికి కాస్త ఆలస్యంగా 11.40 గంటలకు వచ్చారు. అప్పటికే జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌లు జిల్లాప్రజలనుంచి వినతులు స్వీకరించారు. వినతులను ఆయాశాఖల అధికారులకు పంపించారు. కలెక్టర్ వచ్చిన తరువాత విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాల వారు వినతులు ఇచ్చారు. కలెక్టర్ మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రజావాణినుంచి వెళ్లారు. అర్జీదారులు పూర్తయ్యే వరకు అదనపు కలెక్టర్.. వినతులు స్వీకరించారు.

శాఖల వారీగా దరఖాస్తులు ఇలా...

ఈడీ, ఎస్సీ కార్పొరేషన్ 41, డబుల్‌బెడ్రూం నోడల్ అధికారి – 35, జీహెచ్‌ఎంసీ కమిషనర్ –15, డీఆర్‌డీఓ– 6, కాజీపేట తహసీల్దార్– 6, కమలాపూర్ తహసీల్దార్– 5, హనుమకొండ – 5, పరకాల – 4, ఎంజీఎం – 4 రాగా మిగతా శాఖలు, అధికారులకు రెండు, మూడు, ఒక్కోటి చొప్పున మొత్తం 49విభాగాలకు వినతులు అందాయి.



హనుమకొండ కలెక్టరేట్‌లో వినతులు ఇచ్చి రసీదుల కోసం బారులు దీరిన జనం

పదే పదే...



ఒడిలో పసిపిల్లతో ఉన్న ఈ పెద్దాయన పేరు పరిమి వెంకటసుబ్రమణ్య శర్మ. కుడిచేతికి వేళ్లు లేవు. నాలుగు నెలల కిత్రం సదరం సర్టిఫికెట్ తీసుకున్నారు. ఆసరా పెన్షన్ కోసం మున్సిపాలిటీలో దరఖాస్తు చేస్తే రేషన్‌కార్డు లేదని తీసుకోలేదు. చేసేది లేక కలెక్టరేట్‌కు వచ్చారు. ఒంటరిగా రాలేక వెంట కోడలు, నెలల పసిగుడ్డుగా ఉన్న మనుమరాలిని తీసుకుని వచ్చారు. ఇక్కడ కూడా అధికారులు రేషన్‌కార్డు, లేదా ఇన్‌కం సర్టిఫికెట్ ఉంటే దరఖాస్తు పరిశీలనకు స్వీకరిస్తామని చెప్పడంతో చేసేదిలేక వెనుదిరిగిపోయారు. నాలుగేళ్లుగా రేషన్ కార్డు కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతన్నామని, ప్రభుత్వం కార్డులు ఇవ్వడందని అధికారులు చెబుతున్నారని, తనకు పెన్షన్ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సుబ్రమణ్య శర్మ కోరుతున్నారు.

నల్లా లేకున్నా.. రెండు నల్లాల బిల్లు



ఈయన పేరు గుండమీది నాగేశ్వర్‌రావు. ఈయనకు 66వ డివిజన్ పరిధి హసన్‌పర్తి మండల కేంద్రంలో 27-10-69/5/2/ఎఫ్ ఇంటి నంబర్‌పేరుమీద రేకుల షెడ్డు ఉంది. కొద్ది కాలంగా రాజేశ్వర్‌రావు తన ఇంటికి నల్లా కనెక్షన్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఇటీవల ఏకంగా ఆయన ఇంటికి రెండు నల్లా కనెక్షన్లు ఉన్నట్లు .. దానికి పెండింగ్ నీటి పన్ను రూ.2,800 చెల్లించాలని, లేదంటే తదుపరి చర్యలు తీసుకుంటామంటూ నోటీసులు ఇచ్చారు. ఇదేమిటని స్థానిక అధికారులకు ప్రశ్నించినా వినిపించుకోలేదని, ఏం చేయాలో తెలియక కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నానని రాజేశ్వర్‌రావు తెలిపారు. నోటీసులతో అయినా తన ఇల్లు గుర్తించారని, నల్లా కనెక్షన్ ఇచ్చి, ప్రస్తుత నోటీసులు రద్దు చేయాలని ఆయన కోరారు.

ఐదేళ్లుగా తిరుగుతున్నా... రైతుబంధు రావట్లే



హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామానికి చెందిన తాళ్లపెల్లి మొగిలికి సర్వే నంబర్ 182/సీలో 1.06ఎకరాలు వారసత్వంగా వచ్చిన భూమి ఉంది. ధరణి పాస్ పుస్తకం కూడా ఉంది. కానీ రైతుబంధు రావడం లేదు. ఐదేళ్లుగా ఇదే సమస్యతో తహసీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. అయినా పని కావడంలేదు. పాస్ పుస్తకంలో భూమి ఉన్నట్లు ఉన్నా... ఆన్‌లైన్‌లో చూపించడం లేదు. ఎందుకు ఇలా జరిగింది అర్థం కావడంలేదని మొగిలి అంటున్నారు. అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడంలేదని, తన సమస్యను పరిష్కరించాలని మొగిలి కోరుతున్నారు.

శ్రావణమాస ప్రత్యేక పూజలు



మెట్టుగుట్టపై అభిషేకం చేస్తున్న భక్తులు

మడికొండ: శ్రావణమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం శివాలయం, రామాలయాల్లో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, విష్ణువర్ధనచార్యుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి ప్రాతఃకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో కార్యనిర్వహణాధికారి శేషుభారతి, చైర్మన్ దువ్వ నవీన్, అర్చకులు సత్యనారాయణ శర్మ, దేవేందర్ శర్మ, మణిశర్మ, సాయిశర్మ, భక్తులు వెంకటేశ్వర్లు, సురేష్, సిబ్బంది భాస్కర్, రణధీర్, రాజమ్మ, వెంకటమ్మ, కుమార్, అనిల్ పాల్గొన్నారు.

పూలతో శ్వేతార్కుడికి అలంకరణ

కాజీపేట: కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి స్వామికి ఆలయ వ్యవస్థాపకుడు ఐనవోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి దేవతామూర్తులను దర్శించుకున్నారు. భక్తులు అందించిన పూలతో స్వామివారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులతో దేవాలయ వైదిక నిర్వాహకుడు రాధాకృష్ణ శర్మ సహస్ర నామార్చనలు, అభిషేకాలు, అర్చనలు చేయించి తీర్థప్రసాదాల వితరణ చేశారు. అనంతరం భక్తులకు అన్నపూర్ణ భవనంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సాయికృష్ణ శర్మ, మణి, శివ, రవి పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో..

కాశిబుగ్గ: శ్రావణమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని సహస్ర లింగానికి 63కిలోల చక్కరతో అభిషేకం చేశారు. మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి, వేముల నాగరాజు, పోశాలు, పంచాక్షరయ్య, శ్రీనివాస్, వెంకన్న, రవీంద్రచారి, రమాదేవి, లక్ష్మి సౌజన్య, రోజా పాల్గొన్నారు.

నాగ వీరేశ్వరాలయంలో అన్నపూజ

శ్రావణమాసం నాలుగవ సోమవారాన్ని పురస్కరించుకుని 18వ డివిజన్ లేబర్‌కాలనీలోని పంచముఖ నాగ వీరేశ్వరాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

అర్జీలు ఫుల్.. పరిష్కారం నిల్!



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

కరీమాబాద్: వరంగల్ కలెక్టర్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో ఎక్కువగా భూములకు సంబంధించిన అర్జీలు వచ్చాయి. తర్వాత పింఛన్ల కోసం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి.

సదరం క్యాంపు స్లాట్ బుక్ చేసుకునే క్రమంలో సైట్ ఓపెన్ కావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వారం గ్రీవెన్స్‌లో మొత్తం 97 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్లు శ్రీవత్స, అశ్విని తానాజీ వాకడే, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు సూచించారు. జీడబ్ల్యూఎంసీ 4, బీసీ డెవలప్‌మెంట్ 3, వ్యవసాయశాఖ 9, రెవెన్యూ 36, మైనార్టీ వెల్ఫేర్ 3, ఏసీపీ ఖిలా వరంగల్ 1, మిగతావి ఇతరశాఖలకు వచ్చాయి. ప్రజావాణి కార్యక్రమానికి 35 శాఖలకు చెందిన అధికారులు హాజరవ్వాల్సి ఉండగా పలువురు హాజరు కాలేదు.

సైట్ ఓపెన్ అయితలేదంటున్నారు..



నాకు రెండు కళ్లు కనిపించవు. పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు సదరం క్యాంపునకు సంబంధించి సైట్ ఓపెన్ అయితలేదంటున్నారు. కలెక్టర్ ఆఫీసులో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చా.

– ఏరువ మల్రెడ్డి, రెడ్డిపాలెం, ఏనుమాముల

కార్మికులను క్రమబద్ధీకరించాలి



ధర్నా చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు, సిబ్బంది

వరంగల్ అర్బన్: తమను క్రమబద్ధీకరించాలని గ్రేటర్ వరంగల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు, సిబ్బంది డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ప్రధాన కార్యాలయం ఆవరణంలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ, టీఎంఆర్‌పీఎస్, ఐఎఫ్‌టీయూసీ నాయకులు మాట్లాడుతూ 452 మంది కార్మికులకు పీఆర్‌సీ ప్రకారం రూ.15,600 వేతనం అందించాలని కోరారు. పలు డిమాండ్లను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు భిక్షపతి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలయ్య, నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిని కాపాడిన పోలీసులు

మడికొండ: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని మడికొండ పోలీసులు ఆదివారం రాత్రి కాపాడారు. హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ తెలిపిన వివరాల ప్రకారం కడిపికొండ గ్రామానికి చెందిన గోపి.. రాత్రి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడుతున్నానని తన స్నేహితుడు రసూల్ అనే వ్యక్తికి వీడియోకాల్ చేసి తెలిపాడు. రసూల్ సమాచారం మేరకు బాధితుడి వద్దకు నైట్ డ్యూటీలో ఉన్న మడికొండ పోలీసుస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, కానిస్టేబుల్ వీరన్న వెళ్లి కారు అద్దాలు పగలగొట్టి అతడిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్తంగా

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కాజీపేట: కాజీపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న తండ్రి లేదా తల్లి లేని విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను యూత్ ఫర్ సేవా సంఘం సభ్యులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మామిడాల రాజేంద్రం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న పేద పిల్లలకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మల్లికార్జున్, కార్తీక్, నీరజ్, అవినాష్, ఆర్.మహేష్, ఉపాధ్యాయులు పద్మావతి, నరసింహ రావు, శైలజ, వీరస్వామి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల అందజేత

మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్‌ఎస్పీ నాలుగో బెటాలియన్ కమాండెంట్ సీహెచ్ సింధుశర్మ ఆదేశాల మేరకు పున్నేల్ క్రాస్ రోడ్డులోని కనకదుర్గ వృద్ధాప్య ఆశ్రమాన్ని ఆర్ఐ ఏవీఎస్.రెడ్డి, ఆర్ ఎస్సైలు మధు, నవీన్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కరీమాబాద్: ఉర్సు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993 –94వ సంవత్సరంలో పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారందరు ఒకచోట చేరి అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి గురువులను సన్మానించారు. పోశాల సురేష్, పెర్న నాగరాజు, కుసుమ రాజుతోపాటు 12మంది ఉపాధ్యాయులు, 50మంది విద్యార్థులు పాల్గొన్నారు.

గంటూరుపల్లికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు

హసన్‌పర్తి: స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు హసన్‌పర్తి మండలం గంటూరపల్లి గ్రామ పంచాయతీ ఎంపికైంది. కలెక్టరేట్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మంత్రి దయాకర్‌రావు, కలెక్టర్ సిక్తా పట్నాయక్ నుంచి సర్పంచ్ పెద్ది తిరుపతమ్మ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీ దయాకర్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, జెడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, ఎంపీడీఓ రామకృష్ణ ఏపీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట రైల్వే క్యాంటీన్ మూసివేత

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని రైల్వే క్యాంటీన్‌ను మూసివేశారు. ఇటీవల అత్యాధునిక పద్ధతిలో ఏర్పాటు చేసిన మోడల్ రైల్వే క్యాంటీన్ (ఫుడ్ కోర్టు)ను మూసివేసి మూడు రోజులు కావస్తోందని రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. దీంతో తినుబండారాలు, టీ కోసం ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

దారి కబ్జాను అడ్డుకున్న అధికారులు

రామన్నపేట: వరంగల్ కార్పొరేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో దారిని కబ్జా చేసి సోమవారం రాత్రి గేట్ నిర్మాణ పనులు చేపడుతుండగా మున్సిపల్ అధికారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు.

నేడు లక్ష తులసి, 1,008 తామరలతో అర్చన

దేశాయిపేట: వరంగల్ దేశాయిపేటరోడ్డు 13వ డివిజన్‌లోని టీచర్స్‌కాలనీ, గణేష్‌నగర్లలోని ఆది మహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం శ్రావణమాసం సందర్భంగా లక్ష తులసి, 1,008 తామరపూలతో స్వామి వారికి అర్చన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు దామోదర్‌రెడ్డి, రాఘవులు, మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రధాన పూజారి శ్రీరంగం శ్రీనివాసచారి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 1నుంచి రాత్రి 8గంటల వరకు వంద సార్లు విష్ణు సహస్ర నామాలు, గోవింద నామాలు, నిరంతరాయంగా పారాయణం జరపనున్న సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

వరంగల్ కిక్ బాక్సింగ్ అధ్యక్షుడిగా ప్రభాకర్

ఖిలా వరంగల్: వరంగల్ కిక్ బ్యాక్సింగ్ అధ్యక్షుడిగా శివనగర్ భూపేష్‌నగర్‌కు చెందిన కరాటే ప్రభాకర్ (కొయ్యడ ప్రభాకర్) నియామితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియం ఒలింపిక్ భవనంలో సోమవారం జరిగిన తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు ప్రకటించి ప్రభాకర్‌కు ఉత్తర్వులు అందజేశారు.

నరసింహమూర్తికి డాక్టరేట్



హన్మకొండ: హనుమకొండ పరిమలకాలనీకి చెందిన గణిత నిపుణుడు అడ్లూరు నరసింహ మూర్తి.. గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఈనెల 9న గోవాలోని ఆర్చిడ్ రిసార్ట్‌లో జరిగిన యూరో ఏషియన్ యూనివర్సిటీ గ్రాండ్ కాన్వకేషన్‌లో డాక్టరేట్ ఆఫ్ ఫిలాసఫీ ఇన్ స్టాటిస్టిక్స్ స్వీకరించారు.

ఉచిత వైద్య శిబిరం

కాజీపేట: కాజీపేట పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయభాస్కర్ ప్రారంభించారు. పట్టణంలోని ఐదు డివిజన్లకు చెందిన కార్యకర్తలతో పాటు ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ కమిటీ సభ్యుడు కాటపురం రాజు, జిల్లా రైతు సమన్వయ కమిటీ సభ్యుడు చుంచు కృష్ణ, డివిజన్ అధ్యక్షులు రంజిత్ కుమార్, శివకుమార్, రవీందర్ పాల్గొన్నారు.

ఆశవర్కర్ల ముందస్తు అరెస్ట్

హసన్‌పర్తి: తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం తలపెట్టిన ఆశవర్కర్ల చలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈమేరకు హసన్‌పర్తి మండలంలోని పలు గ్రామాల్లో పనిచేస్తున్న ఆశవర్కర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు క్యాంపస్‌లోని పరిపాలన భవనం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 8వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో యూనివర్సిటీల కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, ఎల్‌బీ కళాశాల అధ్యాపకుడు కుమార్, మాట్లాడారు. దీక్షలో డాక్టర్ వీణ, డాక్టర్ ఉషాకిరణ్, శ్రీధర్ కూర్పోగా, డాక్టర్ చిర్రరాజు, మధుకర్‌రావు, విద్యాసాగర్, బ్రహ్మయ్య, చంద్రశేఖర్, నర్సింహరావు, నాగయ్య, రవీందర్ తదితరులు సంఘీభావం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట నుంచి దూపకుంట రోడ్డుపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం వరంగల్ రంగశాయిపేటకు చెందిన జీ.శ్రీనివాస్.. వ్యక్తిగత పనిమీద బైక్‌పై దూపకుంటకు వెళ్లి తిరిగి ఇంటికి బయల్దేరాడు. ఈక్రమంలో నాగులు తిరుపతి అనే వ్యక్తి మద్యం మత్తులో శ్రీనివాస్ బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. దాంతో శ్రీనివాస్ తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌ను హుటాహుటినా ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి మిల్స్‌కాలనీ పోలీసులు చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

సమ్మేళనానికి తరలిన బీజేపీ కార్యకర్తలు

మడికొండ: వర్ధన్నపేటలో సోమవారం నిర్వహించిన పోలింగ్ బూత్ కమిటీ సమ్మేళనానికి మడికొండ నుంచి భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. జిల్లా నాయకుడు, ఎలకతుర్తి మండల ఇన్‌చార్జ్ పానగోటి వెంకట్‌రావు ఆధ్వర్యంలో గద్దం మహేందర్, 46వ డివిజన్ అధ్యక్షుడు ముత్తోజు సురేష్, ఎలగొండ శివ, గద్దం కిరణ్, భాస్కర్, రాజ్‌కుమార్, చంటి, రాజలింగం, కుమార్, తదితరులు తరలివెళ్లారు.

అణగారిన వర్గాలకు అప్పగించాలి



దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న నాయకులు

హన్మకొండ: ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు అణగారిన వర్గాలకు నాయకత్వం అప్పగించాలని ధర్మ సమాజ్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పూరెల్ల రమేష్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పార్టీ ఆధ్వర్యంలో అగ్రకులాల నాయకత్వంలో కొనసాగుతున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీల దిష్టిబొమ్మలను సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 7శాతం లేని అగ్రకులాలు 7రాజకీయ పార్టీలకు నాయకత్వం వహించడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సాయిబాబా, రాజు, నాయకులు రాజేష్, యుగంధర్, రత్నాకర్, రాకేష్, విష్ణు, రూప మహారాణి, నాగరాజు, రవి, రాహుల్, నరేష్, ప్రసాద్, ఎండీ.సలీం పాషా పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



చెక్కులు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

మామునూరు: రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యుడు పసునూరి దయాకర్, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలో రూ. 2.44 లక్షల వ్యయంతో పూర్తి చేసిన సీసీ రోడ్లు, డ్రెయినేజీలను ప్రారంభించి, రూ.70 లక్షల ఖర్చుతో చేపట్టిన మహిళా భవనానికి సోమవారం శంకుస్థాపన చేశారు. అలాగే, వసంతాపురం, స్తంభంపెల్లిలో రూ.3.50 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, బీటీ రోడ్లను ప్రారంభించి, పంట నష్టపోయిన రైతులకు రూ.79.80 లక్షల విలువ చేసే చెక్కులను అధికారులతో కలిసి వారు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ గద్దె బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఏఓ విజ్ఞాన్, మార్కెట్ మాజీ చైర్మన్ చింతం సదానందం, జిల్లా రైతు సమితి చైర్మన్ భిక్షపతి, సొసైటీ వైస్ చైర్మన్ సోల్తి భూమాత, మార్కెట్ డైరెక్టర్ తుమ్మ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



అవగాహన కల్పిస్తున్న ఏహెచ్‌టీయూ సిబ్బంది

కాశిబుగ్గ: మానవ అక్రమ రవాణాను అరికట్టాలని, అది ప్రతీఒక్కరి బాధ్యత అని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఇన్‌స్పెక్టర్ వెంకట్రామ్ సూచించారు. వరంగల్ కమిషనరేట్ ఏహెచ్‌టీయూ ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే గూడ్స్ షెడ్డులో హమాలీ కార్మికులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ పిల్లలు, మహిళలపై దాడులు, వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లలను పనులకు పంపవద్దని కోరారు. ఆపదలో ఉన్న బాలబాలికలు, మహిళల రక్షణకు 100, 1091, 1098, 1930 నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలోని నిరుద్యోగులందరికీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం తక్షణమే నిరుద్యోగ భృతి చెల్లించాలని డీవైఎఫ్ఐ నాయకులు కోరారు. ఈమేరకు కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌సెల్‌లో అదనపు కలెక్టర్ మహేందర్‌జీకి సోమవారం వినతిపత్రం అందజేశారు.

శ్రీచైతన్య స్కూల్‌పై చర్య తీసుకోవాలి

కరీమాబాద్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ వరంగల్ జిల్లా కమిటీ నాయకులు కోరారు. ఈమేరకు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు.

దివ్యాంగ టీచర్లకు ఫిజికల్ వెరిఫికేషన్ చేయాలి

విద్యారణ్యపురి: బదిలీల్లో దివ్యాంగ టీచర్లకు ఫిజికల్ వెరిఫికేషన్ చేయించాలని దివ్యాంగుల ఉద్యోగ, ఉపాధ్యాయుల ఫోరం కన్వీనర్ బిల్ల మహేందర్ కోరారు. ఈమేరకు అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీకి వినతిపత్రం అందజేశారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT WARANAL
O.S.No.671 of 2018

Between
Bank of India, Warangal Branch
Rep., by it's GPA holder ...Plaintiff
And
Mr.Gampa Sudheer
& another ....Defendant

To,
D.1. Gampa Sudheer, S/o.Shankar, Pro. M/s. Dwarakamai Medical & General Stores, R/o. H.No.10-5-106, Near: Hanuman Temple, Girmajipet, Warangal.

Please take summons that the above suit is posted to **04-10-2023** for your appearance. You are hereby summoned to appear before the above Hon'ble Court on **04-10-2023** by 10-30 A.M. in person or through an Advocate to answer the claim, failing which the matter will be heard and decided in your absence.

07-09-2023
//By Order of the Hon'ble Court//
Sd- **Bh.Nageswara Rao,** Advocate
16-4-1114, Shiva Nagar, Warangal.